


భోజనా లయాయి. రామచంద్రమూర్తి చెయ్యి తుడుచుకుంటూ, వరండాలోకి వచ్చి కుర్చీలో కూచుని, పేపరు చదవడం ఆరంభించాడు. నాలుగు నిమిషాలలో సీతకూడా, వంటయింటి తలుపులు వేసుకొని, తమలపాకులూ, వక్కపొడి సీసా, సున్నపు సీసా తీసుకొనివచ్చి మూర్తిప్రక్కన కుర్చీలో కూచుంది. మూర్తి ఆమెవంక ఒకసారి చూసి, మళ్ళీ పేపరు చదువులో లీనమయాడు.

సీత వక్కపొడి అందించింది. మూర్తి అందుకొని నోట్లో వేసుకున్నాడు. సీత, సున్నంరాసిన తమలపాకు చిలకను అందించింది. మూర్తి తలత్రిప్పి చూడకుండానే, చేత్తో చిలకను తీసుకుని నోట్లో వేసుకున్నాడు

"అంత దీక్షగా చదువుతున్నారు, ఏమిటది?" అని అడిగింది సీత.

"ఏదో, నీ కర్థంకాదు" అని తల త్రిప్పిచూడకుండానే జవాబు చెప్పేడు.

"అక్కరలేని గొడవలు నాకెందుకు గాని, యివ్వాళకూడా వెళ్లారు కాదేమండీ?" అంది సీత.

"ఎక్కడికి?" అని అడిగాడు, మూర్తి.

''ఎక్కడికా! రోజూ చెప్పాలికాబోసు. చెప్పి, చెప్పి నాగొంతుకి నొప్పివస్తోంది కూడాను. ఉన్న రెండుచీరెలూ చిరిగిపోయాయి. ఎవరు వచ్చినా, ఎదటబడడానికి సిగ్గేస్తోంది. ఇరవై రోజులనుంచి చెబుతూవున్నాను. పోనీ, షాపుకి వెళ్ళడానికి మీకు తీరకపోతే, ఆ డబ్బేదో నాకిస్తే నేనే వెళ్ళి తెచ్చుకుంటాను. ఎన్నాళ్ళు యీ చింకిగుడ్డలతో గడపనూ...?" అంటూ, మరొక చిలకను అందించింది సీత.

జవాబు చెప్పకుండా, ఆ చిలకను నోట్లో వేసుకున్నాడు మూర్తి

"మాట్లాడ రేమండీ! మీకు కావలసిన సూట్లూ, బూట్లూ మాత్రం నిమిషంలో అమర్చుకుంటారు గదా—'' అని సీత కొంచెం జాలిమొహం పెట్టింది.

"నేను కాస్త మంచిబట్టలు కట్టుకుంటున్నాననేనా, నీ యేడుపు? ఏడు" అని విసుక్కున్నాడు మూర్తి.

"అవును. ఏడవక ఏంచేస్తాను? కాపురానికి వచ్చినప్పటినుంచీ, నా బ్రతుకు ఏడుపు బ్రతుకే అయింది. ఓ మంచిబట్ట చూశానా, అందమైన రవిక చూశానా! పైగా మెళ్ళోవున్న ఒక్క గొలుసూ, అయ్యగారిచేతుల్లో పెట్టినదాకా, అయ్యగారికి నిద్రే పట్టలేదు—" అని సీత అంటూ వుండగానే మూర్తి అందుకున్నాడు.

"సంసారానికి చాలకపోతే ఏంచెయ్యమంటావ్? పెళ్లాం మెళ్లో గొలుసు తీసుకోవడం, నేటికి నే నొక్కణ్ణే చేసినపని కాదు. తగినంత సంపాదించుకోలేని ప్రతి వెధవా చేస్తూనే వున్నాడు. ఆ వెధవలలో నే నొకణ్ణి. వెధవని కనుకనే, సరైన సంపాదనలేకుండా పెళ్ళి చేసుకున్నాను వెధవని కనుకనే, నువ్వన్న అడ్డమైన మాటలూ పడుతున్నాను. వెధవ పెళ్ళి, వెధవ సంసారమూనూ. ఛీ" అంటూ చేతిలో పేపరు నేలకు విసిరికొట్టాడు మూర్తి.

"నేనూ అలాగే నుకుంటున్నాను— ఏ ట్రయినింగో చదువుకుని బ్రతక్కుండా మా నాన్న నన్నిలా చేశాడేమా. అని" అవేసింది సీత.

"నాకర్మం, నీ కర్మం నాకొద్దుబాబూ అని ఎంత బ్రతిమాలినా వినక, యీ సంబంధంతెచ్చి నాకంట కట్టాడు మా అన్నయ్య" అని బయటపెట్టాడుమూర్తి.

"ఇంకో సంబంధం చేసుకుంటే సుఖపడుదు రన్నమాట! ఆ దరిద్రపు ప్రొద్దు నా మొహాన్నే పొడిచిందన్నమాట! ఇలాటి వెధవ బ్రతుకు బ్రతకడంకంటె, ఏ నూతిలోనో, గోతిలోనోపడి చచ్చినా బాగుండును. ఏం సుఖపడుతానని, యీ యింటిని అంటిపెట్టుకొని చావడం! వెధవ వంటలక్కలాగ బ్రతకడంకంటె చావడమే మేలు" అంది సీత.

విసుగులోనూ, కోపంలోనూ, సీత మొహంకేసి చూసి "చస్తే చావు, నీకు అడ్డమొచ్చినవా డెవడు యిక్కడ?" అనేశాడు మూర్తి.

సీతకు కోపం పట్టరానంతగావచ్చింది. "ఎందుకు ఇలాటి వెధవ బ్రతుకు" అని దభాలున వీధితలుపు తీసుకొని, ఛడేల్మని వేసేసుకొని సీత బయటికి వెళ్లిపోయింది,

పది నిమిషాలలో ఇంత ఘోరమైన పరిణామం వచ్చిందేమా అని ఆలోచిస్తూ దిగ్భ్రమచెంది మూర్తి అలాగే, కుర్చీలో కూచున్నాడు.

ఒక నిమిషంకూడా గడవలేదు. మెల్లిగా తలుపుతెరుచుకొని సీత లోపలికి వచ్చింది.

మూర్తి తలయెత్తి, తెల్లపోతూ ఆమె వంక చూశాడు.

"బయటంతా చీకటి గబ్బగిములాగ వుంది. ఏ దొంగ వెధవలేనా తల పగలగొడతారేమో కూడాను" అంటూ పడక గదిలోకి వెళ్లింది సీత.

---